# రే ప టి మ ని షి

నాకు భగవంతం చిన్నప్పట్నుంచీ తెలుసు. అతన్నాతోపాటు కొన్నేళ్ళు చదివాడు మా యింటి దగ్గిరే అతనిల్లు. అతనుంటున్న ఇల్లు చాలా పాతభవనంమూలంగా శిథిలావస్థలో వున్నట్టవుపిస్తుంది. అయితే ఆ యిల్లు గట్టిదిగనక యింకా అలా నిలబడివున్నది. భగవంతానికి ఆ యిల్లంటే చిరాకు. అందుచేత అతను యెక్కువ కాలాన్ని రోడ్డుమీద స్నేహితుల్తోనే గడుపుతూండేవాడు. భగవంతానికున్న కొన్ని కోరికల్లో మొదటిది అందమైన యిల్లు!

భగవంతంవాళ్ళనాన్న పెద్ద ఉద్యోగి కాడు. మా వూళ్ళోనే వున్న లాయరు వెంకటరత్నం చౌదరిగారి కాయన గుమాస్తా. వెంకటరత్నం చౌదరిగారికి మా వూళ్ళో పెద్ద పలుకుబడి వున్నది. గొప్ప ఆస్థిపరుడు.

వెంకటరత్నం చౌదరిగారంటే భగవంతానికి మంట.

అతన్నాతో అనేవాడు—

"మా నాన్నకి నేను కొడుగ్గా పుట్టవలసినవాడిని కానే కాదు. నా దురదృష్టంకొద్దీ నే నిక్కడీయింట్లో పురుగునై పుట్టాను. అవునా సుబ్బారావూ - నేనేగనక వెంకటరత్నం గార్లాంటి జాతి మనుషులకి పుట్టినట్టయితే సాక్షాత్తు స్వర్గం లోని దేవతలు నాకు దాసోహమనేవారు. ఖర్మకాకపోతే ఏమిటిది? దేవుడు నన్ను దీనాతిదీనుడివి కమ్మని దీవించాడు. చూడబ్బాయ్ - ఇంత వయసొచ్చినా అనుభవించేరాత నోచుకోలేకపోయాను. నే నిప్పట్నుంచే కొన్ని ప్రయోగాలు ప్రారంభించాను. నా చుట్టూతా తిరిగే గొప్ప మిత్రులంతా వొట్టి దద్దమ్మలు. ఆ ఫూల్స్‌ని ద్వారానైనా నేను వెలుగులోకి రావాలేగాని, అప్పుడు నానిజస్వరూప మేమిటో నువ్వు నిచ్చింతగా చూడగలవు.

భగవంతానికి గొప్పవాళ్ళమీద భయభక్తుల్లేకపోగా విపరీతమైన 'కసి' వున్నది. నేను గొప్పవాడిని కాదు గనక అత నాకీ విషయాలన్నీ నిర్భయంగా చెబుతూండేవాడు. అతనలా చెబుతున్నప్పుడు నాకు భయంగానూ వుండేది.

భగవంతానికున్న చొరవగానీ, ధైర్యంగానీ నాకు లేవు. నేనంత గంగిరెద్దు మనిషినని మా వాళ్ళతో పాటు పరాయివాళ్ళు కూడా వొప్పేసుకున్నారు. అందుచేత నేను ప్రమాదమైన జంతువునికాదు. చాలా మామూలు మనిషిని!

ఇక్కడే నేనో ఉదంతం చెప్పదలిచాను.

నా కిది బాగా గుర్తు. ఆ యేడాది మేమంతా డిగ్రీ క్లాసులో ఆఖరి సంవత్సరం చదువుకుంటున్నాము. పరీక్షలు

దగ్గరవడం మూలంగా చాలా కష్టపడి చదువుకుంటున్నాము. ఆ రోజుల్లో ఓనాటి రాత్రి పదకొండుగంటల క్కాబోలు భగవంతం తమ్ముడు చిన్నా నా దగ్గరకొచ్చి అన్నాడు.

"మీరు తొందరగా మా యింటికి రావాలి సుబ్బా రావుగారూ!"

కారణం అడక్కుండానే అతనే చెప్పుకొచ్చాడు.

"అన్నయ్య ఏడుస్తున్నాడు, నాన్న కారణం అడుగుతే చెప్పడంలేదు. మా యింట్లో ఎవరడిగినా ఏమీ చెప్పకుండా ఏడుస్తున్నాడు. మిమ్మల్ని వెంటబెట్టుకు రమ్మని నాన్న నన్ను పంపాడు. రండి తొందరగా.

నేను ఆశ్చర్యపోయాను. సాధారణంగా భగవంతం ఏడవడు. చిన్న చిన్న విషయాల నతను పట్టించుకోడసలు. ఏదో పెద్ద ఉపద్రవం కలిగిందేమోనని నేను భయపడ్డాను.

భగవంతం వాళ్ళ నాన్న నన్ను చూస్తూనే కళ్లు తుడుచుకుని అన్నాడు—

"రా, బాబూ! రా, నీ కోసవేఁ చూస్తున్నాను. అదిగో, ఆ దక్షిణం గదిలో వాడున్నాడు. వెధవ, పసిపిల్లాడిలా ఏడ్చేడ్చి యిప్పుడే కొంచెం కుదుటపడ్డాడు. వెళ్లు బాబూ, వెళ్లు. వెళ్ళి వాడి నోదార్చి కారణం కనుక్కో ఫర్వా లేదు. వాడికేం కావలసినా నేనున్నాను. కొండమీద కోతినైనా సరే తీసుకొస్తాను. వాడికేంకావాలో కనుక్కో. వాడేంకోరినా సర్వాలేదు. నే నున్నాను. అంతేగాని, నేను బ్రతికుండగా వాడు యేడ్చేందుకు వీల్లేదని చెప్పు. నే నదిసహించలేను. వాడు ఏడవకూడదు సుబ్బారావ్. వాడికోసం

నేనేమైనాచేస్తాను. అలాఅని వాడికి గ్యారంటీయివ్వు. తొందరగా వెళ్ళు నాయనా......"

ఆయనిరకంగా చాలాసేపు మాటాడినప్పుడు నామనసు చివుక్కుమంది. ఆయనకి భగవంతంమీద గల వాత్సల్యాన్ని నేనెంతో శ్లాఘించాను. కానీ, ఆవాత్సల్యానికి కూడా ఒక హద్దుండాలి. ఒక రాజకుమారుడు బంగారు ఏనుగు కావాలని గారాం చేసినప్పుడు, రాజమాత యెంతో ముచ్చటపడి, ఆ ఏనుగుని రప్పించినంత 'స్థితి' లో ఆయనకున్న ఆవేశాన్ని ప్రదర్శించాడే తప్ప – భగవంతాన్ని మెప్పించేందుకు ఆయన 'హోదా' చాలదని నే నప్పుడేకాదు. ఎప్పుడూ అనుకుంటూ వుంటాము.

"అయ్యా ప్లీడరుగుమాస్తాగారూ! ఏమిటి సార్ మీరు మాట్లాడేది, భగవంతం మీకు కొడుకయితే కావచ్చు కానీండి, అతని హోదాగల కోరికలు మీరు విన్లేదు. అతన్ని భరించడం మీలాంటి అర్భకులకి చాతొచ్చేది కాదులెండి. భగవంతానికి 'భగవంతానికి తృప్తివిలువ తెలీదు సార్! అందుచేత భగవంతం ఈ జన్మకి సుఖపడడని చెప్పి నేను రాసిస్తాను. హైకోర్టులో నే కాదు, సుప్రీంకోర్టుకు వెళ్ళినా దానికి తిరుగులేదంతే. మీరేం బుర్ర పాడుచేసుకోవద్దుగానీ, వొదిలేయండి. ఎవడికెంత రాసిపెట్టివుందో అంతే జరుగుతుంది.

నేను భగవంతం గదిలోకి వెళ్ళాను. భగవంతం ఓ కిటికీ దగ్గిర కూర్చుని మొహాన్ని కిందికి వొంచి నేలని

చూస్తున్నాడప్పుడు. మనుషుల్ని కృంగదీసే చింతనంతా అతనొక్కడే కలిగినట్టున్నాడు. శోకమయమైన నగరాన్ని కళ్ళారా చూచి వొచ్చి మనసుని పాడుచేసుకున్న సిద్ధార్థుడు వెంటనే గుర్తుకొచ్చాడు నాకు. అవుతే ఒక్కమాటమాత్రం నిజం. ఆరు నూరయ్యేది నూరు ఆరయ్యేదీ, భగవంతం సన్యసించడు. అందుచేత నేనింకా ధైర్యంగా వున్నాను.

అతను తలెత్తి చూశాడు. మళ్ళా వెంటనే తల దించేశాడు. తలుపు దగ్గిరగావేసి అతని దగ్గిరికి వెళ్ళి కూర్చున్నాను. నేనతన్ని ఓదార్చలేదు. నాకో అనుమానం కలిగింది. అందుచేత అడిగాను.

"బాగా చదివావా భగవంతం?"

అతను తలవూపాడు.

"మరెందుకీ దిగులు?"

అప్పుడు భగవంతం నా వేపు సూటిగాచూసిఅన్నాడు.

"నేను పరీక్షలు గురించి, దిగులుపెట్టుకున్నానని నువ్వెందుకనుకున్నావసలు?"

"నా మనసు కదొక్కటే తోచిందిప్పుడు."

"అందుక్కాదు సుబ్బారావ్! పరీక్షలు గురించి నేనెప్పుడూ దిగులుపెట్టుకోను. నా జీవితం గురించి నాకు దిగులెక్కువ. నిజం చెప్పరా. నేను భవిష్యత్తులో బాగుపడి వెలిగిపోగలనా? నాకంత అదృష్టం వుందా? చెప్పు సుబ్బారావ్!"

నాకప్పుడు కోపమొచ్చింది. అందుచేత నేను కటువుగా అన్నాను.

"అందుకే నీతో స్నేహం చేయడమంటే నాకు చెడ్డ చిరాకు. ఎగ్గూ బొడుగూ లేని నూత్రూపాయల గుమాస్తా లాగా ఇప్పట్నుంచే నీకెందుకంత దిగులు? ప్రస్తుతం మనం చదువుకుంటున్నాం. మనముందు నిచ్చెనలూ, పాముకోళ్ళూ వున్నాయి. ఈ వైకుంఠపాళిలో మనం నిచ్చెనే ఎక్కుతామో పామునోటనే బడతామో యిప్పుడే ఆలోచించకూడదు. ఇప్పుడు మనం చేయవలసింది ఒక్కటే-పుస్తకపారాయణం. ఈ కర్తవ్యం ముందు కానివ్వు. తర్వాత దానిగురించి ఆలోచిద్దాం. ఇటుచూడు భగవంతం! నీకంటే నాదేం పొడి చేసే జాతకం కాదుగదా! నన్ను చూడు నిమ్మకి నీరెత్తనట్టు నేనెంత ప్రశాంతంగా బ్రతుకుతున్నానో. నాలాగా నువ్వెందుకుండలేవూ?—"

"నువ్వు నీలాంటివాళ్ళంతా ఫూల్స్‌రా, ఫూల్స్. నేను ఫూల్‌ని కాదు. నేను రేపటి 'మనిషి'ని. కొన్ని పదుల సంవత్సరాల ముందర మనిషిని! నా కోసం, ఆ కాలాన్ని బంగారం చేసుకునేందుకు నే నిప్పట్నుంచే ప్రయత్నించాలి. అవునా, అలాటి దిప్పుడేమయిందో తెలుసా సుబ్బారావ్..."

అతని గొంతు పూడుకుపోతుందని తెలిసి నేను వాదించాను కోపంగా—

"ఆడపిల్లలా ఏడవకు. ఏడవకుండా చెప్పదలచుకున్నది ఖచ్చితంగా చెప్పేయ్."

"వెంకటరత్నం చౌదరిగారమ్మాయిని నేను ప్రేమించాను."

ఆమాట వినడంతోటే ఉలిక్కిపడ్డాను. భగవంతం 'ఆశ'ని తెలుసుకుని నేను ఆశ్చర్యపోయాను. ఎంతెయినా, మరీయింత విడ్డూరమా? ఈరోజు లెలాటివి? ఎక్కడో కథల్లో తప్ప – ఈభూమ్మీద వర్గపోరాటం ప్రతిమూల సాగుతూనే వుందిగదా. ఒకరిదగ్గర కొలువుచేస్తున్న మనిషి కొడుకు ప్రేమించడమా? అందునా ఆ కామందు కూతురినా? ఇంత తెగింపా? రాజకుమారి, తోటమాలి కొడుకు కలలోనైనా కన్నెత్తి చూడకపోవడం జీవితం. ఈవ్యత్యాసాన్ని భగవంతం ఎందుకు తెలుసుకోలేదు.

"మరి ఈ ప్రేమసంగతి మీ నాన్నకి తెలుసా?"

"నా ప్రేమ సంగతి మా నాన్న కెందుకు తెలియాలి? పైగా నేను చౌదరిగారమ్మాయిని ప్రేమిస్తున్నానని తెలుస్తే మా నాన్నగుండె ఆగిపోతుంది. మా నాన్న చౌదరి దగ్గర నేల కంటుకుపోయి బతుకుతాడు. ఇపుడే ఆ మనిషిముందు మా నాన్న తలెత్తి తిరగడుగదా! కనక, నిజమేమిటో తెలుసా సుబ్బారావ్. మా నాన్న వాళ్లింట్లో గుమాస్తాగాడు కాపోతే లలిత నాకు దక్కేది. నా ప్రేమ చచ్చిపోవడానికి ముఖ్య కారణం మా నాన్న. కేవలం ఈ పీడ్లరు గుమాస్తా! షేమ్."

"మరెందుకనుకున్నావ్. ఈ బోడిపరీక్షలు నాకో లెక్కగాదు. నాక్కావలసిన జీవితం నాకు దొరుకుతే ఈ చదువుల్నీ, ఈ పరీక్షల్నీ అవతలికి తోడిపారేస్తాను... ప్రేమి

స్తున్నట్లు నటించి, నాకు పిచ్చెత్తించి, మరో గొప్ప వెధవని పెళ్ళిచేసుకుంటోంది లలిత! ఈ భగవంతం ప్రేమ నంబర్ వన్. రేపు నెంబర్ టూ కూడా నన్నిరకంగానే 'దగా' చేస్తే నేనేనాటికి బాగుపడేది సుబ్బారావ్! చెప్పు."

"ప్రేమ లేకపోతే బతకలేవా?"

"బుద్ధిలేని ప్రశ్న. చెబితినిగదా నేను మీలాంటి చవటని కాను. కాదనీ, డబ్బున్న బంగారు పక్షినే ప్రేమిస్తాను. నా గీత బాగుండాలేగాని, దానివల్ల నేనేం సాధిస్తానో నువ్వు కళ్ళారాచూచి అదిరి చస్తావ్."

నేను లేచి నిలుచున్నాను.

"వెళ్ళిపోతున్నావా!"

"నువ్వెందు కేడుస్తున్నావో తెలీక ఓదార్చి కారణం కనుక్కోమని నన్ను మీ నాన్న పంపాడు. నువ్వు మహా గొప్ప మేధావివని తెలిసింది. అందుచేత మరి నోరెత్తకుండా వెళ్ళిపోతున్నాను"

"నన్ను క్షమించానని మనస్ఫూర్తిగా చెప్పి వెళ్ళరా బాబూ!"

నాకు నవ్వొచ్చింది. హేళనగానే అన్నాను—

"నేను నిన్ను క్షమించడమా?"

"అవును. నువ్వే నన్ను క్షమించాలి. నా వాగుడు నీ మనసుకి కష్టం కలిగిస్తే క్షమించి మరీ వెళ్లు _ అంతేగాని పలహాలివ్వకోరేయ్! నీమీద అపరిమితమైన గౌరవం సుబ్బా

రావ్! నువ్వు తలుచుకుంటే నన్ను క్షణంలో మార్చిపారేయ గలవు. ఆ పనిమాత్రం చేయొద్దని ప్రాధేయపడుతున్నాను. అంతే!”

ఏం చెప్పాలో తోచక తలొంచుకుని వొచ్చేశాను.

—ఆ తర్వాత భగవంతం బి. ఎ. పరీక్ష పాసైనప్పుడు గానీ, అతను ఎమ్మేకి విశాఖపట్టణం వెళ్ళినప్పుడు గానీ నేను సంతోషించలేకపోయాను. నాకు వీలుకాని పై చదువులకి అతను నోచుకున్నాడనే ఈర్ష్య కాదిది.

భగవంతంకొరకు, కేవలం ఆడంబరాల నిమిత్తం ఆ ప్లీడరు గుమస్తా వినియోగిస్తున్న డబ్బునీ, త్యాగాన్నీ చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతుండేది. కొడుకు ఉజ్జ్వల భవిష్యత్తు నిమిత్తం తండ్రి ఎన్నెన్ని త్యాగాలు చేసినా, ఎంత నెత్తురు ఖర్చుపెట్టినా విచిత్ర మనిపించలేదు. కాని, తండ్రి ప్రేమనీ వాత్సల్యాన్నీ, పేరిమనీ ఆధారం చేసుకొని అర్థంలేని విలాసాల్లో మునిగే కొడుకు ప్రవర్తన నాకుగిట్టదు. భగవంతం విశాఖపట్టణంలో వెలిగిస్తూన్న జీవితం నా కెప్పటికప్పుడు మిత్రులద్వారా తెలుస్తూనే వుండేది. ఇక్కడ వాళ్ళ నాన్న వేలకివేలు అప్పులు చేస్తుండడంగూడా గమనించిన మనిషిని గనక - బొమ్మా బొరుసూ రెండూ చూస్తూన్నాన్నేను.

అరవై అయిదు చివర్రోజుల్లో భగవంతమే నాకో ఆశ్చర్యకరమైన వార్త పంపాడు. మనిషి ప్రేమించాల్సిందే.

అదేం బూతుకాదు. అవుతే ఆ ప్రేమవెనక ఇతరమైన ఉద్దేశం కూడదంటాను,

భగవంతం పెళ్ళి చేసుకోబోతున్నాడు. వధువుపేరు పద్మ. పద్మ భగవంతానికి క్లాసుమేటు. ఇంతవరకూ బాగానే వుంది. పద్మ విధవని చదివినప్పుడు భగవంతానికున్న చొరవ ప్రమాదమనిపించింది నాకు.

ఆ ఉత్తరం పుచ్చుకొని భగవంతం వాళ్ళింటికి వెళ్ళాను. అంతక్రితమే భగవంతం చేయనున్న ఘనకార్యం తెలిసి అతని తల్లి శోకదేవతే అయ్యింది.

'విన్నావా నాయనా సుబ్బారావూ, మా వాడు మమ్మల్నెలా ఉద్ధరిస్తున్నాడో. వంశంలో లేనిపని వాడు చేసేస్తున్నాడు. ఇన్నేళ్ళూ పెంచి పెద్దజేసినందుకు వాడు మాకు చెల్లించే ప్రతిఫలం చూస్తివిగా. వాడికోసం ఈ మా రాజెంత కష్టపడ్డారో నువ్వూ ఎరుగుదువుగా. వాడిని పువ్వులా పెంచేరు నాయనా! కళ్ళల్లో పెట్టుకొని పెంచేరు. ఆరుగురు పిల్లలున్నారింక. వాళ్ళందరి నోళ్ళూ కట్టిపారేసి వాడినింత చేసేరు.'

ప్లీడరు గుమస్తా ఆ శోకదేవతని ఓదార్చ ప్రయత్నించారు.

'ఏడవకే బాబూ, ఏడవకు. నీదంతా పిచ్చిగోల. మన రోజులిలా తగలడ్డాయని నోరు మూసుకూర్చో. వాడినైనా సుఖపడనివ్వు. ఎందుకీ రాద్ధాంతం. కాలముంది చూశావు,

అదే వాడికి జవాబు చెబుతుంది! ఇవాళ వాడు విధవల్ని పెళ్ళాడాడు. రేపేమొ...నాయనా భగవంతం! విజ్ఞుడవై పోయావురా! పోనీలే నాన్నా. నువ్వయినా సుఖపడు. మా చేయిదాటి వెళ్ళావు. నూరేళ్ళూ సుఖంగా వర్థిల్లు చిట్టీ!"

♦ ♦ ♦

నాతోపాటు చదువుకుని, ఉద్యోగానికీ - హోదాకీ సంబంధించినంతవరకూ నన్ను మించిన నా స్నేహితు లనేక మంది వున్నారు. వాళ్ళని చూచినప్పుడు నేను అసూయ చెందనుగానీ, వాళ్ళు నన్ను 'తక్కువ' చేస్తే మాత్రం నేను బాధపడతాను.

రవీంద్రభారతిలో నేనొక నాటక ప్రదర్శనకి వెళ్ళాను. నాటకం ప్రారంభించేముందు అక్కడ హాజరైన పెద్దలు కొందరు వేదికమీదకొచ్చి తెలుగు నాటకాల గురించి మాటాడారు. ఆ వక్తల్లో భగవంతంగూడా వుండటంవల్ల నే నమితంగా సంతోషించాను;

భగవంతం ఆంధ్ర రాజధానిలో కీర్తి ప్రతిష్ట లందుకున్నాడంటే ఆనందించాను. అతననేక సాంఘిక కార్యకలాపాల్లో చేయి కలుపుతుంటాడని నే నిక్కడి కొచ్చిన తొలి దినాల్లోనే వినివున్నాను.

ఈ సమాజంలో 'అరుదైన' ఒక ఘనకార్యాం తెగింపుతో చేసిన ప్రతి తెలివిగల మనిషీ ప్రముఖుడేనని నా ఉద్దేశం. విధవా వివాహం మాటల్లో సులువేమోగానీ, అను

భవానికది పరీక్షని నా అభిప్రాయం. అంతటి విలువైన మార్గాన్ని భగవంతం అనుసరించి, తద్వారా అతను వెలిగిపోతున్నాడు.

కొన్నేళ్ళక్రితం అతని ఆవేశాన్ని నే నెప్పటికీ మర్చిపోలేను. ఆపని కలలన్నీ నాకు గుర్తున్నాయి. అతను నమ్మిన సిద్ధాంతాన్ని అతను అనుసరించి లాభం పొందుతున్నాడు. భగవంతం ఎంతకైనా తగును!'

ఆ నాటకం పూర్తయిం తర్వాత నే నతన్ని కలుసుకొనేందుకు బయటికి వెళ్ళాను. అతనో నల్లటికారు పక్కని నించుని సిగరెట్టు కాలస్తున్నాడు. అతని చుట్టూతా కొందరు మనుషులు నించున్నారు. వాళ్ళందరికీ అతను ఏదో విషయాన్ని విపులీకరించి చెబుతున్నాడు. వాళ్ళతి శ్రద్ధగా వింటున్నారు.

నేను వాళ్ళందరికీ కొంచెందూరంలో నిలబడివున్నాను. ఉన్నపళంగా భగవంతాన్ని చేయెత్తి పిలిచేంత చొరవ నాకిప్పుడు లేదు. ఇప్పుడతను ఖరీదుగా ఎదిగివున్నాడు. అతని మొహంలోనూ, అతను కట్టుకున్న దుస్తుల్లోనూ ఒక వింత వెలుగు, ఒక హోదా స్పష్టంగా కనిపించింది. అక్కడికీ అతను నావేపు చూచిన ప్రతిమాటూ, నేను అతనితో మాటాడాలనే ఉత్సుకతని సాధ్యమైనంత స్పష్టంగా తెలిజేసుకున్నాను.

కానీ, అతను నన్నుపట్టించుకొనే సితిలోలేడు. నోటితో పిలవకపోయినా, అతని హోదాకి తగ్గ విధంగా కళ్ళతోనైనా పలుకరించవచ్చుగా. అదీ జరగలేదు.

అభిమానం చంపుకునేందుకు మనసొప్పక నే నక్కడ్నుంచి కదిలొచ్చేశాను. భగవంత మనబడే ఓ ప్లీడరు గుమాస్తా కొడుకు—జాతకం తిరిగి ప్రముఖుడైనంత మాత్రాన యింత తలబిరుసా? మనిషి బుద్ధేయింతా? లేక అది కొందరికే వర్తిస్తుందా?

అతను బంగారాన్నే తింటూండవచ్చు! అతను అమృతాన్నే ఆరగా ఆరగా తాగుతూండొచ్చు; అతను ఇంద్ర భవనంలోనే కాపురం వుండొచ్చు—కాని అతని అదృష్టానికి నేను ఈసు చెందను. కానీ. చిన్ననాటి మిత్రుడిన్నేను. ఇది అతనెందుకు మరిచిపోయేడు?

నే నిన్ని అనుకున్న తర్వాత గొప్పవాళ్ళందరిమీదా నాకు కోపం వొచ్చేసింది. నా ముందునుంచి పోతున్న ప్రతి కారునీ, ప్రతి ఖరీదైన మనిషినీ కసిగా చూసాను. చాలా దూరం నడిచి వొచ్చేసిం తర్వాత నా బక్క కోపానికీ, అల్పత్వానికీ సిగ్గుపడ్డాను.

చిక్కడపల్లి దగ్గర పడుతూండగా, నా వెనగ్గా కారు హారను వినిపించింది. ఉలిక్కిపడి రోడ్డుకి పక్కగా తొలిగాను. పేవ్‌మెంటుమీద నిలబడిపోయాను. ఆ కారు సరిగ్గా నా ముందుకొచ్చి ఆగింది.

ఆ కారులో భగవంతాన్ని చూశాను. నా మనసులో గూడు కట్టుకున్న శంకలన్నీ మటుమాయమై పోయాయి. చాలా ఆనందంగా నవ్వగలిగాను.

డ్రైవరు వెనక తలుపు తెరిచి నించున్నాడు.

"రా, వొచ్చి నా పక్కన కూచో !" అన్నాడు భగవంతం.

ఒక్క గెంతులో కారులోకొచ్చి కూర్చున్నాను. నేను కూచున్న తర్వాత కారు కదిలింది.

"దేవుడిలాకనిపించి, మళ్ళా అంతలోనే మాయమై పోయావు. నువ్వు హైదరాబాదు వొచ్చినట్టు తెలిసింది కానీ, కలుసుకోడం పడేలేదు. ఎక్కడుంటున్నావ్?"

"చిక్కడపల్లిలో."

"భార్యా పిల్లలూ..."

"వాళ్ళంతా బందరులోనే వున్నారు. రేపాదివారం వెళ్ళి తీసుకొస్తాను."

"అంతా క్షేమమా?"

నేను తలూపాను. అతనో సిగరెట్టు నాకిచ్చాడు. అతనూ ఒకటి ముట్టించి పొగని నింపాదిగా వొదిలి అన్నాడు.

"మావగారి బిజినెస్‌లో చేరాను. లక్షలమీద సాగుతోంది. మొన్నీమధ్యనే నాకోసం ఒక ఇల్లు కట్టించారాయన. కొడుకయినా, అల్లుడైనా—నే నొక్కడ్నే. ఎలా వుంది నా కథ?"

"బాగుంది."

"ఇంతందమైన కథతో చోటుచేసుకునేందుకు నేనెంత ప్రయత్నించానో తెలుసా?"

"తెలీదు. కానీ, వూహించాను."

"ఈజిట్? అయితే ఆ తమాషా ఏమిటో చెప్పు వింటాను."

"ఇప్పుడుగాదు, మరోనాడు చెబుతాను."

"వాయిదా ఎందుకుట?"

"నే నూహించింది నిజమని ముందు తెలియాలి."

"ఆల్ రైట్. అలాగే దాచుకో" అన్నాడుత ను.

మా కారు ఓ అందమైన 'భవంతి' ముందు ఆగింది. ఇద్దరం దిగేము. గేటు దగ్గిరున్న మనిషి భగవంతానికి తలొంచాడు.

ఎంతో ముచ్చటైన గదిలో నే నొక్కడ్నీ వున్నాను. పండు వెన్నెల్లాంటి లైటు వెలుతురు, సన్నగా చక్కని రేడియో సంగీతం; పంకా సున్నితమైన శబ్దం; అదంతా మనసుని అలరించే వాతావరణం. ఇక్కడిలాగే యుగాలు గడిచిపోతే బాగుండుననిపించింది.

భగవంతం బట్టలు మార్చుకు వొచ్చాడు. ఇప్పుడతను దొరబాబులా వున్నాడు. వొస్తూనే అన్నాడు.

"ఒక గంటలో భోజనం రెడీ అవుతుంది. ఆకలిగా వున్నా సరే, నోరుమూసుక్కూచోవాలి, వీలవుతుందా?"

"నిజం చెప్పాలంటే నాకిప్పుడ కల్లేదు."

"అది ఆరోగ్యానికి మంచిది కాదోయ్ సుబ్బారావ్! పద్మ ఫ్రెండ్సుతో సినిమా కెళ్ళిందట. పరిచయం చేద్దామనుకున్నాను."

"నిన్న చూశానుగా—వేరే మీ ఆవిడ్ని చూడక్కర్లేదు."

"అదేమిటి?"

"అదంతే. ఒక లెక్క. నువ్వింత ఆనందంగా వున్న మనిషివి. ఒకటీ ఒకటీ రెండు. అనగా..."

"ఆపు. లెక్కల మాస్టారూ! నీ లెక్క తప్పింది. ఒకటీ, ఒకటీ—ఒకటే."

నాకర్థం కాలేదు. అదోలా అతనివేపు చూశాను. అతనక్కడ్నుంచి లేచి ఓ బీరువా దగ్గర ఆగాడు. దాన్లోంచి ఓ సీసా తీశాడు. సీసాతో రెండుగ్లాసులూ పట్టుకొచ్చి నా ముందున్న బల్లమీదుంచాడు.

"ఇది మందు. మనిషికి మంచి టానిక్కు. మనిషి ఏడ్చినప్పుడూ నవ్వినప్పుడూ బాగా పనిచేస్తుంది. దీని ఖరీదు ఎనభై రూపాయల చిల్లర. వాడబడే మనిషి సత్తానిబట్టి ఈ ఒక్క సీసా ఒకేసారి పుచ్చుకోనూ వొచ్చు, లేదూ—ఆరగా ఆరగా వారంరోజులూ వాడుకోవచ్చు. సాధారణంగా నేనీ పాళ్ళని దృష్టిలో పెట్టుకోను. ఎంత దొరికితే అంతా పుచ్చుకుంటాను. నువ్వు నాకు మిత్రుడివి, అతిథివి. నీకేం అభ్యంతరం లేకపోతే, నీ ముందుంచిన గ్లాసులోకి నీ ఇష్టమొచ్చినంత వొంచుకో" అన్నాడతను.

"నాక్కావలసినంత అభ్యంతరం వుంది. నాకొద్దు."

"వెల్ సెడ్! చాలమంది చాలా వాటికి భయపడి ఛస్తారు. నే తాగితే నీ కేమైనా అభ్యంతరమా?"

"వుండదు."

"దేవుడు నిన్ను కాపాడాలి! చూడు నాయనా సుబ్బా రావూ నా విశ్వరూపం! నేను తాగుతూ నా కథంతా చెబు తాను. నువ్వు నోరుమూసుకుని అదంతా విను. కథ పూర్త యిన తర్వాతనే నీ సందేహాలు వింటాను. తెలిసిందా? భగ వంతం కథ ఈ చుక్కతో ప్రారంభం! విని౦క.

"ఆఫ్టరాల్ ఓ ప్లీడరు గుమాస్తా కొడుకున్నేను. నా పేరు భగవంతం. ఈ భగవంతానికి ఒక విశాలమైన హృదయ ముంది. ఆ హృదయంలో బంగారుకల లనేకం. ఈ భగవం తానికి బోల్డు ప్రపంచంవుంది. తమ్ముళ్ళూ చెల్లాయిలూ వెరశి ఆరుగురున్నారు. వాళ్ళందరిమధ్యా ఆ యింట్లో భగవంతానికి సుఖంలేదు. తండ్రని చెప్పబడే ఆ పూర్ ప్లీడర్ గుమాస్తా జీవితం పరుగుపందెంలో ఆరు దశాబ్దాలు వెనక పడిపోయి ఆయాసంతో అడుగు వేయలేకపోతున్నాడు. ఇది భగవంతా నికి ఒక గొప్ప డిస్ క్వాలిఫికేషన్! వింటున్నావా సుబ్బా రావ్! ఈ స్వీయ కథ మరో మనిషికి నేను ఛస్తే చెప్పను. నువ్వు నా చెలికాడివి, నా ప్రాణానివి. అందుచేత ఈ ఛాన్స్ నీకు దక్కింది.

"పథకం వేసేను. లలితను ప్రేమించేను. మనకి మనిషి చెప్పుకునే కులాల పట్టింపులేదు. మనక్కావలసిన కుల మొక్కటే, డబ్బు కులం! లలితని పెళ్ళాడి వెంకటరత్నంచౌద

రీని తిందామనుకున్నాను. లలిత గొప్పనటీమణి గనుక నా చేతుల్లోంచి పారిపోయింది. అక్కడితో ఒక వెలుగు దూరమైంది.

'బి. ఎ. పాసయ్యాను. ఎమ్మేకి వెళ్ళాను. బక్క నాన్నని నడుం విరిగేలాతన్ని డబ్బులు మింగాను. ఆ బక్క మనిషి నాగురించి మొదట్నుంచీ తలొంచేశాడు. నాన్నా డియర్ నీ ప్రాణం యివ్వు, దాంతో నాకు పనుందనిఅడిగితే, అంతకంటేనా చిట్ పుచ్చుకోబాబూ అనేయగల అతిమంచి దుర్మార్గుడాయన. అందుకే పేదవాడు అప్పుల్లో మునిగి యస్ ఒ యస్ అంటున్నాడిప్పుడు. వా టేఫాల్ మైడియర్ ఫాదర్! మే గాడ్ పనిష్ యూ!

“యూనివర్సిటీలో పద్మ కనిపించింది. మొగుడుపోయి అదేడుస్తున్నకాలాన్ని తెలివిగా వాడుకోవాలనుకున్నాను. పద్మ వివరాలు కనుక్కుని తృప్తిచెందాను. వేట ప్రారంభమయ్యింది. ఏడవకేడవకు పద్మా, నువ్వేడవకు, నువ్వేడిస్తే నేనేమైపోవాలి? పోయినవాళ్ళగురించి మనం యెంతేడుస్తే ఏం ప్రయోజనంచెప్పు? లే. నేనున్నాను. ఈహృదయంలోనీకోసం యింతజాలినీ, ఇంత ప్రేమనీ అభిమానాన్నీ దాచాను. అదంతానీది. నీదేపద్మా అని కవిత్వంచెప్పాను. ఎంతకీనావేపు నుంచే కథ నడిచిందిగానీ, అటునుంచి ఒకవాక్యంగూడా నడవలేదు. పద్మగానీ, మావగానీ సామాన్యులుకారు, వారంతే. మగవాడి ఆసరాతో అవసరమున్న పందిపిల్ల పద్మ. బురద నుంచిపుట్టిన పువ్వని భ్రమపడ్డానేగాని, ఆ పువ్వునిండా బురదున్నదని గ్రహించలేకపోయాను. పద్మని పంకజమనూ నీ

బొందనూ నేనవేమీ పట్టించుకోను. నువ్వాశ్చర్యపోవద్దురా అబ్బీ!

"ఆల్ రైట్, నేను విధవా వివాహం చేసుకుని సమాజంలో ఒక గొప్పస్థానాన్ని సంపాయించేసి, మావగాడి ఆస్థికి వేటకుక్కనై పోయాను. బిజినెస్—ఇక్కడ న్యాయం, అన్యాయం, ధర్మం, అధర్మం ఈ పద్దులేమీ ఉండవు. ఉన్నదల్లా డబ్బు. ఆ డబ్బునెన్నిరకాలుగా, ఎంతెంత గడ్డితిని సంపాయించాలనే తాపత్రయం, అదే ఉన్నదిక్కడ. పెళ్ళాంతో సంబంధం లేదు. పేదనాన్నని తలుచుకునేందుకు టైంలేదు.

"మావ జీనియస్, దొంగని వెతికిపట్టుకుని వాడి చేతిలో తాళం చేతుల్నుంచి, వాడి చుట్టూతా కొందరు భటుల్నుంచాడు. దొంగవెధవ, ప్రతిమూమెంటునీ మైక్రో ద్వారా లాగేసి ప్రాణాలు తినేస్తున్నాడు.

"నా పెళ్ళయ్యేముందు కొన్ని ఆంక్షలు. ముఖ్యమైనది —నాకు తల్లీ తండ్రిగానీ, అక్క తమ్ముళ్ళుగానీ, చెల్లీ వుండకూడదు. నే నప్పుడు నవ్వేసి 'యస్' అన్నాను. అనక నా పెళ్ళి. అనగా ఉరి. ఒరేసుబ్బారావ్! నువ్వూ, నీ లాటి అమాయకులంతా మంచివాళ్ళురా బాబూ! మీకు సుఖాలు తప్ప నీడలు తెలీవు. నేను నీడల్లోవుండి సుఖపడి ఛస్తున్నానన్రోయ్ అనే భ్రమని మీకు కలిగిం చేస్తున్నాను.

"నాన్న ఉత్తరం రాశాడు. ఆర్థికంగా చితికిపోయాట్ట, నుకేమవుతాడేం? ఎప్పటికయినా ఎగిరి పారిపోయే ఈ పక్షిని నమ్ముకున్న ఆ మని షేమవుతాడేం? మూలధనానికి నష్టం

రాదని నామీద ఆయన శరీరంలో వున్న ప్రతినెత్తుటి బొట్టునీ వెచ్చించినందుకు ఏమవుతాడేం? పిల్లవాడిని వ్యాపారలక్షణంగా పెంచాడు. ఆ వ్యాపారం ఇప్పుడు దివాలాతీసింది. ఐ. పి. పెట్టేశాడక్కడ. చెల్లి పెళ్ళెటరా సుబ్బారావ్! పెళ్ళి. తమ్ముడికి క్షయట. అమ్మకేదో తెలీని మాయరోగమంట! భయంకరంరా బాబూ!

"నేను ఈ దుఃఖాలు వినకూడదు. ఈ కష్టాలు తెలుసుకోగూడదు. ఇవన్నీ తెలుసుకుంటే మావగాడి వేటకుక్క యేమైపోగలదో వూహించావా? అందుచేత యివేమీ నాకు తెలీకూడదు. గనక నాకొచ్చే ఉత్తరాలూ, ఖబురూ అన్నీ యిక్కడ సెన్సార్ జరుగుతాయి. ఏవో కొన్ని దారుణాలు మాత్రం అప్పుడప్పుడూ తెలుస్తుంటాయి.

"ఏపిల్ పండులాగున్నానని అనుకుంటారు గదరా మీరు? ఓరి వెధవలూ! నా నరనరంలోను స్థానం చేసుకున్న విషప్పురుగులసంగతి మీకేం తెలుసురా? నేను దయ్యాన్ని, పెద్దభూతాన్ని. ఈ ప్రపంచంలో జరిగే అవినీతికీ, దుర్మార్గానికీ ప్రతిబింబాన్నేను. మందెక్కువయిన మాటలు కావురా యివి ఇవా. నిన్న చూచింతర్వాత నా గుండె తలుపులు తెరుచుకున్నాయి. ఓపిగ్గా వినంతే. ఇదెందుకిలా జరిగింది? చెబ్తానువిను.

"నాకు కొన్ని శాపాలున్నాయ్. నడుం విరిగిన నాన్న శాపం, కుమిలి కుమిలేడుస్తున్న అమ్మశాపం; నన్ను నమ్ముకున్న నాచిట్టి చెల్లాయీ, తమ్ముళ్ళశాపం. తెలిసిందిరా

అబ్బ! ఇన్ని శాపాలతో పాటు నా దుర్మార్గం. ఇంకెక్కడరా నేను సుఖించేది? ఓరిపిచ్చీ! నేను నిత్యదుఃఖితుడినిరా, నాకు సుఖం లేదు. నాకెప్పుడో జ్ఞానోదయం కలిగింది. అప్పట్నుంచీ నేను లోలోన ఏడుస్తూనే వున్నాను. ఎంతో ఖరీదయిన నా కన్నీరు వృధా అవుతూనే వుంది."

ఇంతకథా చెప్పి సీసా వేపు చూచి నవ్వేశాడు.

"అయ్య బాబోయ్! చాలా తాగేశాను అన్నాడు.

ఆతర్వాత అతని తలని బల్లమీదుంచి వలవలా ఏడవడం ప్రారంభించాడు. నాకు జాలికలిగింది. అతని భుజమీద చేయివేశాను. చేతిసతనలాగే పట్టేశాడు. నా చేతితోనే అతని కన్నీరుని తుడుచుకున్నాడు.

"ఎంతచల్లని చేయిరా నీది దుర్మార్గుడా? మా అమ్మ మాటలాగా, మా నాన్న మనసులాగా నీచేయి యెంత చల్లనిదిరా సుబ్బారావ్! అదృష్టవంతుడివి. అందుకే నీలో నేను నావాళ్ళనందర్నీ చూచుకున్నాను.

థేంక్స్, వెరిమెనీ థేంక్స్. అప్పుడే నువ్వెళ్ళకు. ఇవాళ మనిద్దరం కలిసి భోజనం చేద్దాం. భోజనం పూర్తవ్వగానే నీ కోసం నాకారు రెడీగా వుంటుంది. దాన్లో నువ్వెళ్ళిపో. మళ్ళా నాకు కనిపించకు. నువ్వు కనిపిస్తే — నేనిలా గుండె బద్దలయేలా ఏడుస్తారా! అబ్బ! అందుచేత నువ్విక నాక్కనిపించకు. అరే — అదేమిట్రా పిచ్చిలోకమా? నువ్వేడుస్తా

వెందుకురా? ఏడవకోరేయ్ — నా కోపం వొచ్చేస్తుంది. ఏడవకంతే" అన్నాడతను.

చిత్రం — ఈ మనిషిని నేనెందుకు క్షమించాను?

—భారతి మాసపత్రికనుండి 1967 జూలై